సాక్షి కర్నూలు

మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



నృత్య నీరాజనం

మహానంది: కార్తీక చివరి సోమవారం సందర్భంగా మహానందీశ్వర ఆలయ అలంకార మండపంలో నంద్యాల సాయి నాట్యాంజలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



మల్లన్న సేవలో..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దేవదాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్ కరికాల వలవన్ సోమవారం దర్శించుకున్నారు.



నీటి కుక్కల సందడి

శ్రీశైలం టెంపుల్: నీటిమట్టం తగ్గడంతో పాతాళ గంగలో మెట్ల మార్గంలో నీటి కుక్కలు సందడి చేశాయి. టూరిజం శాఖ ఏర్పాటు చేసిన జెట్‌పై ఆడుతూ కనువిందు చేశాయి.

న్యూస్‌రీల్

అగ్రానమీ ఏడీఏగా అరుణకుమారి



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోఅగ్రానమీ ఏడీఏగా అరుణకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ శాఖ ఆదోని సబ్ డివిజన్ ఏడీఏగా పనిచేస్తున్న ఈమెను ఇటీవల డిప్యూటేషన్‌పై డీఏఓ కార్యాలయం అగ్రానమీ ఏడీఏగా బదిలీ చేస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతల స్వీకరణకు ముందు ఆమె జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిలాఉంటే ఇక్కడ అగ్రానమీ ఏడీఏగా పనిచేస్తున్న బాలవర్ధిరాజును ఆదోని సబ్ డివిజన్ ఏడీఏగా బదిలీ చేశారు.

క్వింటా మిర్చి రూ.28299

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండుమిర్చితో పాటు వివిధ పంటలకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. 2023-24లో సాగు చేసిన మిర్చి దిగుబడులు ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు వస్తున్నాయి. సోమవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 757 క్వింటాళ్ల మిర్చి వచ్చింది. కనిష్ట ధర రూ.2,599, గరిష్ట ధర రూ.28,299 లభించింది. మోడల్ ధర రూ.20 వేలు నమోదైంది. మినుముల ధర క్వింటా రూ.9,209 పలికింది. కందులకు గరిష్టంగా రూ.10,040 ధర లభించింది.

- కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. నిన్న, మొన్నటి వరకు రూ.3,500-రూ.3,900 వరకు ఉన్న ధర పడిపోయింది. మార్కెట్‌కు 3,780 క్వింటాళ్ల ఉల్లి రాగా కనిష్ట ధర రూ.302, గరిష్ట ధర రూ.2,861 లభించగా.. మోడల్ ధర రూ.2,621 నమోదైంది.

20న జగనన్న తోడు నిధుల విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): జగనన్న తోడు 8వ విడత కింద చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు రుణాలను అందిస్తుంది. దాదాపు మూడు నెలలుగా గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ-వైకేపీ, పట్టణ ప్రాంతాల్లో మెప్మా అధికారులు, సిబ్బంది చిన్న వ్యాపారులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయిస్తున్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో వడ్డీతో సహా చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రీయింబర్స్‌మెంటు చేస్తుంది. ఇందుకు సంబంధించిన నిధులను ఈ నెల 20న ప్రభుత్వం నిధులు విడుదల చేయనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా బటన్ నొక్కి చిరువ్యాపారుల బ్యాంకు ఖాతాలకు వడ్డీ విడుదల చేస్తారని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా తెలిపారు.

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

- అధికారులను ఆదేశించిన జేసీ నారపురెడ్డి మౌర్య



అర్జీలను పరిశీలిస్తున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ..స్పందన అర్జీలు రీఓపెన్ కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా స్పష్టమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. నిర్దీత గడువులోపు అర్జీలను పరిష్కరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేరుగా సమీక్షిస్తుండడంతో పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఈమె పేరు ఎస్.హలీమాబీ. మండల కేంద్రమైన గోనెగండ్లకు చెందిన ఈమె ఓ సాధారణ గృహిణిగా ఉండేవారు. 2004లో షాషా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరారు. 2020-21లో వైఎస్సార్ చేయూత కింద లభించిన ఆర్థిక సహాయంతో మొదట కుట్టుమిషన్‌తో జీవనోపాధిని వృద్ధి చేసుకోవడం ప్రారంభించారు. మరో రెండు విడతలుగా చేయూత కింద ఆమెకు ఆర్థిక లబ్ధి చేకూరింది. మొత్తంగా మూడ విడతల్లో రూ. 56,000 వచ్చింది. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.10,200 లభించాయి. స్త్రీనిధి నుంచి ఈమె రూ. 50 వేలు రుణం తీసుకున్నారు. స్థానిక బ్యాంకు రూ.లక్ష రుణ సదుపాయం కల్పించింది. దీంతో హలిమాబీ టెక్స్‌టైల్స్ బిజినెస్ ప్రారంభించారు. అన్ని ఖర్చులు పోగా నెలకు రూ.18,000 నికరాదాయం పొందుతున్నారు.



ఈ చిత్రంలోని మహిళ పేరు జి. జయమ్మ. కర్నూలు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఈమె అంబేడ్కర్ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. ఈమెకు వైఎస్సార్ చేయూత కింద రూ.56,250 లభించాయి. బ్యాంకు రూ.50వేలు అప్పు ఇచ్చింది. ఈ మొత్తంతో శిరీష కిరాణం స్టోర్‌ను కొద్ది నెలల క్రితం ఏర్పాటు చేశారు. రిలయన్స్, హెచ్‌యూఎల్, ఐటీసీ కంపెనీలు నాణ్యమైన నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్నాయి. అన్ని ఖర్చులు పోగా... నెలకు రూ.15,000 ఆపైనే ఈమె నికరాదాయం పొందుతున్నారు. వైఎస్సార్ చేయూత తన జీవితాన్ని మలుపుతిప్పిందని ఈమె తెలిపారు.

చేయూత 'ఆమే'యం

- మూడేళ్లలో వైఎస్సార్ చేయూత కింద రూ.666.50 కోట్ల ప్రయోజనం
- జిల్లాలో 71,029 మంది మహిళల జీవితాల్లో వెలుగులు
- నాడు సాధారణ గృహిణులు.. నేడు వ్యాపారులు
- వివిధ రంగాల్లో రాణిస్తున్న నారీమణులు
- మహిళల అభ్యున్నతికి బ్యాంకుల తోడ్పాటు



ప్రభుత్వ పథకాలపై పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

కర్నూలు (అగ్రికల్చర్): మహిళల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. వైఎస్సార్ చేయూత పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. బ్యాంకులు ఉదారంగా రుణాలు పంపిణీ చేస్తుండడంతో జీవనోపాధులు మెరుగుపడ్డారు. ఒకరిపై ఆధారపడకుండా మహిళలు వివిధ రంగాల్లో స్వశక్తితో రాణిస్తున్నారు. జిల్లాలో 34 వేల స్వయం సహాయ సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 3.50 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో వీరు వివిధ రంగాల్లో రాణిసున్తన్నారు. మహిళా మార్టులతోపాటు జీన్స్ పాయింట్లు, జ్యూట్‌బ్యాగ్‌లు, ఊదిబత్తీల తయారీలోనూ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తీపి పదార్థాలు, వివిధ తినుబండరాలు తయారు చేసి దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. పొదుపు సంఘాల్లో 3.50 లక్షల మంది మహిళలు ఉండగా..దాదాపు 90 శాతం మంది ఏదో ఒక నైపుణ్యాన్ని పెంచుకొని, వివిధ వృత్తుల్లో రాణిస్తున్నారు.

ఏటా రూ.18,750 చొప్పున ఆర్థిక సాయం

మహిళల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ చేయూత పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 45 నుంచి 60 ఏళ్ల లోపు కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు ఏడాదికి రూ. 18,750 చొప్పున అందజేస్తోంది. 2020-21 నుంచి ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. వైఎస్సార్ చేయూతకు అదనంగా వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాల సదుపాయం కల్పిస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాల కూడా ఇస్తున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి వరుసగా నాలుగో ఏడాది వైఎసార్ చేయూత కింద నిధులను జనవరిలో విడుదల చేయడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.

మూడేళ్లలో రూ.666.50 కోట్ల ఆర్థిక తోడ్పాటు

మూడేళ్లలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మహిళలకు చేయూత కిందరూ.666.50 కోట్లు ప్రయోజనం కల్పించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు రూ.478.49 కోట్లు, పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలకు రూ.188.01 కోట్లు ప్రకారం ఆర్థిక ప్రయోజనం లభించింది. దీంతో నిన్న, మొన్నటి వరకు సాధారణ గృహిణిలుగా ఉన్న మహిళలు... నేడు వ్యాపారులుగా రాణిస్తున్నారు. ఈ పథకం కింద వేలాది మంది పొదుపు మహిళలు జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్నారు.

నెలకు గరిష్ఠంగా రూ.30 వేల ఆదాయం

వైఎస్సార్ చేయూత పథకం కింద లభించిన ఆర్థిక చేయూతతో మహిళలు తమకు ఆసక్తి కలిగిన వృత్తులు, వ్యాపారాలు కొనసాగిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. మహిళల అభ్యున్నతికి రిలయన్స్, హెచ్‌యుఎల్, ఐటీసీ, పీ అండ్ జి కంపెనీలు సహకరిస్తున్నాయి. వైఎస్ఆర్ చేయూత కింద 56,441 మంది మహిళలు రూరల్ రిటైల్, టెక్స్‌టైల్ తదితర వ్యాపారంలో రాణిస్తున్నారు. అన్ని రకాల వృత్తుల్లో 71,029 మంది రాణిస్తున్నారు. వివిధ రకాల జీవనోపాధులు అభివృద్ధి చేసుకున్న మహిళలకు బ్యాంకులు, ఇతర సంస్థలు దాదాపు రూ.302.05 కోట్లు రుణాలుగా మంజూరు చేశాయి. వివిధ వృత్తుల ద్వారా మహిళలు అన్ని ఖర్చులు పోగా నెలకు సగటున కనిష్ఠంగా రూ.10వేలు, గరిష్ఠంగా రూ.30 వేల వరకు నికరాదాయం పొందుతున్నారు.

మూడేళ్లలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైఎస్సార్ చేయూత ఆర్థిక తోడ్పాటు ఇలా..

సంవత్సరం	లబ్ధిపొందిన మహిళలు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2020-21	1,11,316	208.72
2021-22	1,20,106	225.20
2022-23	1,24,045	232.58
మొత్తం	3,55,467	666.50

వైఎస్సార్ చేయూత ఆర్థిక తోడ్పాటుతో జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్న వారి వివరాలు..

జీవనోపాధి పేరు	రాణిస్తున్న మహిళలు
రిటైల్ వ్యాపారాలు	4,918
వస్త్ర వ్యాపారం	1,802
డెయిరీ	8,974
గొర్రెలు, మేకల పెంపకం	19,502
పెరటి కోళ్ల పెంపకం	1,807
ఆహార ఉత్పత్తులు	738
వ్యవసాయ ఉత్పత్తులు	26,229
ఇతర వృత్తుల్లో రాణిస్తున్న వారు	7,059
మొత్తం	71,029

మహిళల జీవనోపాధులు మెరుగుపడ్డాయి



ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు అందిస్తోంది. వైఎస్సార్ చేయూత ద్వారా జీవనోపాధులు వృద్ధి చేస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక తోడ్పాటుతో వేలాది మంది మహిళలు వివిధ వృత్తుల్లో రాణిస్తున్నారు. వివిధ వ్యాపారాలు, వృత్తుల్లో రాణిస్తున్నారు. ఇప్పటి వరకు మూడేళ్ల పాటు చేయూత అమలైంది. నాలుగో ఏడాది వైఎస్సార్ చేయూత కింద ఆర్థిక సాయం జనవరితో విడుదల కానుంది. వైఎస్సార్ చేయూత పథకంతో మహిళలు జీవనోపాధులను అభివృద్ధి చేసుకుంటున్నారు.

– సలీమ్‌బాషా, డీఆర్‌డీఏ, వైకేపీ పీడీ

వైభవంగా పద్మనాభతీర్థుల మధ్యారాధన



పద్మనాభ తీర్థుల బృందావనానికి పుష్పార్చన చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం: మధ్వమత పూర్వ పీఠాధిపతి పద్మనాభతీర్థుల ఆరాధన వేడుకలు కనుల పండువగా సాగాయి. సోమవారం కర్ణాటకలోని అనేగొంది నవ బృందావన క్షేత్రంలో మధ్యారాధన వేడుకలు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పద్మనాభతీర్థుల మూలబృందావనానికి విశేష పంచామృతాభిషేకం చేశారు. అనంతరం పుష్పమాలలతో అలంకరించి హారతులు పట్టారు. మధ్వమత ఖ్యాతిని చాటుతూ పద్మనాభ తీర్థులు ధార్మిక కార్యక్రమాలతో హిందూ ధర్మ ప్రచారం చేశారని గుర్తు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.

రేపు జిల్లాలో కరువుపై సెంట్రల్ టీం పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని కరువు తీవ్రత ఎక్కువగా ఉన్న ఆరు మండలాల్లో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం(ఐఎంసీటీ) ఈ నెల 13న పర్యటిస్తుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సెంట్రల్ టూర్ ప్రోగ్రామ్‌ను సోమవారం ఖరారు చేశారు. జిల్లాలో తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలు మినహా మిగిలిన 24 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించింది. సెంట్రల్ టీంకు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, ఫార్మర్ వెల్ఫేర్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పంకజ్ యాదవ్ నేతృత్వం వహిస్తున్నారు.

- 13న ఉదయం 10 గంటలకు పత్తికొండ మండలంలోని జూటూర్‌కు సెంట్రల్ టీం చేరుకుంటుంది.
- అక్కడ 11 గంటల వరకు దెబ్బతిన్న పత్తి, ఆముదం, టమాట, కంది, మిర్చి పంటలను పరిశీలించడంతో పాటు రైతులతో ముఖాముఖి అవుతారు.
- మధ్యాహ్నం 11.15 నుంచి 12 గంటల వరకు ఆస్పరి మండలంలోని బిల్లేకల్లులో వర్షాభావంతో దెబ్బతిన్న వివిధ పంటలను పరిశీలిస్తారు.
- ఆ తర్వాత ఆదోని మండలం విరుపాపురం గ్రామంలో క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించనున్నారు.
- ఆదోనిలో మధ్యాహ్నం భోజనం ముగించుకున్న తర్వాత ఆలూరు మండలం హులేబీడు, కమ్మరచేడు, దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, నెల్లిబండ, కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి, రామచంద్రాపురం గ్రామాల్లో పర్యటిస్తారు.
- సాయంత్రం 6.30 గంటలకు కర్నూలు చేరుకుని.. రాత్రి 8 గంటల వరకు కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు.
- అనంతరం కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో పాల్గొని కరువుపై సమీక్ష నిర్వహిస్తారు. 14న నంద్యాల జిల్లాలో పర్యటిస్తారు.

సెంట్రల్ టీం పర్యటనను విజయవంతం చేయండి

కర్నూలు (సెంట్రల్): ఈ నెల 13న జిల్లాలోని వివిధ మండలాల్లో సెంట్రల్ టీం పర్యటన నేపథ్యంలో జేసీ నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కరువును కళ్లకు కట్టినట్లు చూపించాలని ఆదేశించారు. పంటల పరిస్థితి, తాగునీటి ఇక్కట్లు, పశు గ్రాసం, భూగర్భ జలాల దుస్థితి తదితరాలను వివరించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలన్నారు.

లా నేస్తం.. వృత్తిలో రాణించేందుకు సాయం

- జిల్లాలో 135 మంది జూనియర్ న్యాయవాదులకు రూ.40.50 లక్షల జమ
- క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేసిన సీఎం వైఎస్ జగన్
- హర్షం వ్యక్తం చేసిన యువ న్యాయవాదులు



మెగా చెక్కును జూనియర్ న్యాయవాదులకు అందజేస్తున్న కలెక్టర్ సృజన, చిత్రంలో మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): జూనియర్ న్యాయవాదులు వృత్తిలో రాణించేందుకు వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. యువ న్యాయవాదులు పట్టా అందుకున్న వెంటనే కోర్టుల్లో ప్రాక్టీసు కోసం సీనియర్ న్యాయవాదుల దగ్గర పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆ సమయంలో వారికి అవసరమైన పుస్తకాలు, ఇతర ఖర్చుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.5 వేలను అలవెన్సుల కోసం అందజేస్తోందని తెలిపారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూనియర్ న్యాయవాదులకు జూలై నుంచి డిసెంబర్ వరకు సంబంధించిన అలవెన్సులను ఒక్కొక్కరి ఖాతాలో రూ.30 వేలను జమ చేస్తూ ఆన్‌లైన్‌లో బటన్ నొక్కారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తోపాటు పలువురు యువ న్యాయవాదులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో 2023-24 సంవత్సరానికి సంబంధించి 135 మంది ఎంపికకాగా, ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున మొత్తం 40.50 లక్షల రూపాయలను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ స్టైఫండ్‌ను జూనియర్ న్యాయవాదులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు న్యాయవాదులకు ఆర్థిక చేయూతను ఇస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రజలందరినీ మోసం చేశారని, కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలందరికీ న్యాయం చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో యువ న్యాయవాదులు వైఎస్ఆర్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ..ఆర్థిక సాయాన్ని పొందుతున్న యువ న్యాయవాదులు పేదలకు ఉచితంగా న్యాయ సలహాలు ఇవ్వాలన్నారు. కక్షిదారులను ఇబ్బంది పెట్టకుండా న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జూనియర్ న్యాయవాదులకు రూ.40.50 లక్షల మెగా చెక్కును కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు సూర్యనారాయణరెడ్డి, షాషావలి, డీఎల్‌డీఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంచుకున్నా



మా నాన్న వ్యవసాయ కూలి. ఎంతో కష్ట పడి నన్ను చదివించారు. జగనన్న పుణ్యామా అని మూడేళ్ల నుంచి వైఎస్ఆర్ లానేస్తం ద్వారా నెలకు రూ.5 వేలు అందుతోంది. ఈ డబ్బుతో తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా న్యాయ వృత్తిల్లో నైపుణ్యాలను పెంచుకున్నాను. భవిష్యత్తులో ఉత్తమ న్యాయవాదిగా రాణించడమే నా లక్ష్యం.

– రామాంజనేయులు, ఎర్రగుడి, కోడుమూరు మండలం

కష్టాలు తొలగాయి



ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా జూనియర్ న్యాయవాదులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక చేయూతను ఇస్తున్నారు. నెలకు రూ.5 వేల ఆర్థిక సాయం అందుతుండటంతో మా కష్టాలు తొలగాయి. పుస్తకాలకు, ఇతర ఖర్చులకు ఇబ్బంది లేకుండా ఉంది. భవిష్యత్తులో పేదలకు ఉచితంగా న్యాయం అందిస్తాం. జగనన్న ఆశయాన్ని సాధిస్తాం.

– శివ, కర్నూలు, కర్నూలు నగరం

సాయం మరువలేం



మాది పేద కుటుంబం. పీర్ల మాన్యం భూమి చేసుకుంటూ కూలీనాలీ పోయి జీవనం సాగిస్తున్నాం. తొమ్మిదేళ్ల క్రితం నాకు రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. వైద్యుల సూచనల మేరకు అప్పటి నుంచి మందులు వాడుతున్నాం. కిడ్నీలు పూర్తిగా పాడవడంతో ఈ ఏడాది జనవరిలో బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చేరాను. నా భర్త కిడ్నీ ఇవ్వడంతో అప్పు చేసి ఆపరేషన్ చేయించుకున్నాను. ఆర్థిక కష్టాల్లో ఉన్న మాకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.6 లక్షలు సాయం చేశారు. ఆ డబ్బుతో అప్పు తీర్చాం. జగనన్న చేసిన సాయం ఎన్నటికీ మరువం. ఆయకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. – షరీఫూన్‌బీ, షంషుద్దీన్ దంపతులు, జి.ఎర్రగుడి, తుగ్గలి మండలం



ఇంతలా ఏ ప్రభుత్వమూ చేయలేదు



కొంతకాలంగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. బాడుగలు గిట్టని పరిస్థితుల్లో వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద ఏటా రూ.10 వేల చొప్పున నాలుగేళ్లలో రూ.40 వేల ఆర్థిక సాయం అందింది. రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.7వేల చొప్పున నాలుగేళ్లలో రూ.28 వేలు, నా కుమారుడి చదువు కోసం అమ్మ ఒడి పథకం ద్వారా నా భార్య ఖాతాకు ఏడాదికి రూ.10 వేల చొప్పున నాలుగేళ్లలో రూ.40 వేలు జమ అయ్యింది. మాలాంటి పేదలకు ఇలాంటి ఆర్థిక సహాయం గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదు. జగనన్నకు మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– ఎల్లమద్ది బాలన్న, ఓర్వకల్లు

కర్నూలుకు రూ.130 కోట్ల 'అమృత్' నిధులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు అమృత్ పథకం 2.0 (ఫేజ్-2) కింద రూ.130 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం రాత్రి జీవో 150 జారీ అయ్యింది. ఈ నిధులతో నగరపాలక సంస్థ పరిధిలోని కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో మంచినీటి వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే ప్రజారోగ్య శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జగన్నాథ గట్టు వద్ద 50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంట్లు నిర్మించనున్నారు. అలాగే కల్లూరు, కర్నూలు ప్రాంతాల్లో మంచినీటిని నిల్వ చేసుకునేందుకు 22 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నారు. పరిపాలనా అనుమతులు రావడంతో టెండర్ల ప్రక్రియ ద్వారా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

పర్యాటక ప్రాంతంగా 'బిల్ల సర్గం'



బిల్లసర్గం గుహలను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామ సమీపాన ఉన్న బిల్లసర్గం గుహలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ గుహలను మంత్రి సోమవారం పరిశీలించారు. రూ.2.50 కోట్లతో చేపట్టిన గుహల అభివృద్ధి, రహదారి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. జనవరి నెలఖారుకు ప్రారంభోత్సవం నేపథ్యంలో పనులను మరింత వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. గుహల సమీపంలో ఏర్పాటవుతున్న రెస్టారెంట్ పనులను పరిశీలించారు. ఇప్పటికే గుహలను సందర్శించే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పర్యాటక కేంద్రానికి అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.